పాఠశాలల నిర్వహణకు నిధులు

జిల్లాకు రూ.3.04 కోట్లు మంజూరు



పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడులకు ఎట్టకేలకు నిర్వహణ నిధులు మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్షా కేటాయించిన పాలనా నిధులను పక్కదారి పట్టించారు. దీంతో కనీసం సుద్దముక్కలు కొనుగోలు చేయాలన్నా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుల నిర్వహణ నిధుల మంజూరుపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టి పెట్టారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40,728 ప్రభుత్వ బడులకు రూ.51.91 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 21వ తేదీన సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి జిల్లాలోని 1662 పాఠశాలలకు రూ.3.04 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి ఇందులో 50 శాతం నిధులు రూ.1.52 కోట్లు ప్రధానోపాధ్యాయుల ఖాతాలో జమ కానున్నాయి. పాఠశాల స్థాయి, విద్యార్థుల సంఖ్యను బట్టి ఈ నిధులు కేటాయించనున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది లోపు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 లోపు పిల్లలుంటే రూ.25 వేలు, 101-250 వరకు విద్యార్థులున్న బడులకు రూ.50 వేలు, 251 నుంచి 1000 మందివరకు విద్యార్థులున్న బడులకు రూ.75 వేలు వరకూ విడుదల కానున్నాయి.

అల్లూరి అనుచరుల వారసులకు అండ!

కొయ్యూరు, న్యూస్‌టుడే

విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుల వారసులకు ఎట్టకేలకు పక్కా ఇళ్లు సమకూరుతున్నాయి. ఎంతోమంది ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతల పరామర్శలు చేసి హామీలు ఇచ్చారు తప్ప అమలు చేసిన దాఖలాల్లేవు. క్షత్రియ పరిషత్ చొరవ తీసుకొని నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో గృహనిర్మాణాలకు మోక్షం కలిగింది. రూ. రెండు కోట్లతో నడింపాలెం శివారు బట్టపనుల పంచాయతీ లంకవీధి సమీపంలోని ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.



గాం గంటం దొర మనవడు బోడిదొరని సన్మానించి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ (పాత చిత్రం)

మన్యంవీరుడు అనుచరుడు గాం గంటందొర వారసులైన ఐదు గురు సంతానికి చెందిన 11 కుటుంబాలు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నాయి. వీరి పరిస్థితిని ఏ నాయకుడు, అధికారి గుర్తించిన పాపాన పోలేదు. గంటందొర మనవడు బోడిదొర చాలా దీనస్థితిలో కాలం వెళ్లదీశారు. బోడిదొరను రెండేళ్ల క్రితం ప్రధాని మోదీ భీమవరంలో సన్మానించారు. నర్సీపట్నంకు చెందిన క్షత్రియ సేవాసంఘం ప్రతినిధులు.. ఆ కార్యక్రమానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ యాజమాన్యం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు ఇళ్ల నిర్మాణానికి రూ. రెండు కోట్లు కేటాయించారు. గతేడాది నవంబర్‌లో గృహ నిర్మాణాలకు అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవోతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. రెండు భవనాలను నిర్మించారు. ఒక్కో భవనంలో ఆరు కుటుంబాలు ఉండేలా రెండు పడక గదులు, హాలు, వంటగదిని సిద్ధం చేశారు. గంటందొర వారసులైన లక్ష్మణదొర, బుచ్చిదొర, బోడిదొర, తెల్లనదొర, సోమన్నదొరలకు చెందిన 11 మంది సంతానం గాం పెంటన్నదొర, బాబూరావు, నీలకంఠం, రాంబాబు, బోడిదొర, సీతారామయ్య, సీతమ్మ, రాజుబాబు, శివ, మల్లయమ్మలకు ఈ ఇళ్లు కేటాయించారు. మిగిలిన వాటిని శుభకార్యక్రమాలకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. పనులన్నీ చివరిదశలో ఉన్నాయి.



ప్రారంభానికి సిద్ధమవుతున్న గృహ సముదాయం

రూ.రెండు కోట్లతో శాశ్వతగృహాలు

విద్యుత్తు సదుపాయం కల్పించాలి : నూతనంగా నిర్మించిన గృహ సముదాయాలకు విద్యుత్తు సదుపాయం లేదు. జడ్పీటీసీ సభ్యుడి నిధుల నుంచి చిన్న తాగునీటి పథకం ఏర్పాటు చేశారు తప్పితే దానికి విద్యుత్తు కనెక్షన్ లేదు. దీంతో జనరేటర్ సాయంతో నీటిని తోడుకొని పనులకు వినియోగిస్తున్నారు. విద్యుత్తు సదుపాయం కల్పించాలని గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లకు కలిసి విన్నవించినా ఫలితం లేకపోయిందని గంటందొర వారసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీవో, కలెక్టర్ చొరవ చూపి విద్యుత్తు సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు



బోడిదొర చిత్రపటాన్ని ఆయన వారసులకు అందిస్తున్న జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపకులు పడాల వీరభద్రరావు (పాత చిత్రం)

24 గంటల్లో అర్జీలు పరిశీలించాల్సిందే

పాడేరు, న్యూస్‌టుడే: అర్జీదారుల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖాధికారులు 24 గంటల్లో పరిశీలించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 166 వినతులు స్వీకరించారు. సంయుక్త కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు వినతులను పరిశీలించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా ఉండాలని పేర్కొన్నారు. ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీ తేనెలమామిడి గ్రామస్థులు రోడ్డు నిర్మించాలని విన్నవించారు. డీఆర్ఓ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ మురళి, గిరిజన సంక్షేమశాఖ ఈఈలు జి.డేవిడ్‌రాజ్, కె.వేణుగోపాల్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఈఈ బాలసుందరబాబు, ఇన్‌ఛార్జి డీడీ రజని తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ ఐటీడీఏ పీఓ

గురుకుల విద్యార్థి మృతి


వైస్ ప్రిన్సిపల్ కొట్టడంతోనేనని తల్లిదండ్రుల ఆరోపణ

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బడ్నాయిని విజయ్‌కుమార్(15) ఈనెల 22న అనారోగ్యంతో బాధపడుతూ అరకులోయ ప్రాంతీయ వైద్యకేంద్రంలో చికిత్స నిమిత్తం చేరాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యులు గురువారం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వైస్ ప్రిన్సిపల్ కొట్టటం వల్లే విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాలుడి స్వగ్రామం ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ పొల్లిపుట్. ఈ విషయంపై గురుకుల పాఠశాలల సమన్వయకర్త పీఎస్ఎన్ మూర్తిని వివరణ కోరగా విద్యార్థి ఊపిరితిత్తుల్లో ఇబ్బందులతోపాటు పలు అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు.

ఏడాదికే ఎత్తేసినట్టా?



అందంగా ఉన్న ఆర్నమెంట్ నర్సరీ



పిచ్చిమొక్కలతో నిండిందిలా..

అరకులోయ, న్యూస్‌టుడే: పర్యాటకులను అలరించేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో అరకులోయలోని అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. గతేడాది నవంబర్‌లో సుమారు రూ.80 లక్షల నిధులు వెచ్చించి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. పర్యాటకులు సెల్ఫీలు దిగేందుకు, విడిది చేసేందుకు వీలుగా ఇక్కడ టెంట్‌లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఏడాది గడవక ముందే దీన్ని గాలికొదిలేశారు. పిచ్చిమొక్కలతో ఆ ప్రాంగణమంతా దర్శనమిస్తోంది. నిర్వహణ లేకపోవడంతో అడవిని తలపిస్తోంది. అటవీశాఖ అధికారులు నిధులు ఖర్చు చేసి కమిషన్లు పొందేందుకే అధిక ప్రాధాన్యమిచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. దీనిపై అరకులోయ రేంజ్ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా.. నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.



అందంగా ఉన్న చిన్నారుల పార్కు



పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

గూడెంకొత్తవీధిలో వైకాపాకు షాక్

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలంలో వైకాపాకు గట్టి షాక్ తగిలింది. వైకాపా ప్రభుత్వ హయాంలో పీఏసీఎస్ ఛైర్మన్‌గా పనిచేసిన వసుపరి ప్రసాద్, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ విరోజి త్రిమూర్తులు, ప్రస్తుత పెదవలస సర్పంచి వంశీకృష్ణ, మాజీ సర్పంచి జుంబు బాలరాజు సహా వార్డు సభ్యులు దొరబాబు, నాయకులు త్రినాథ్, రమణ, బాబులు, వెంకన్నపడాల్ జనసేనలో చేరారు. శుక్రవారం జనసేన పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంపూరు గంగులయ్య సమక్షంలో పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాలన తమను ఆకర్షించిందని నాయకులు తెలిపారు. గంగులయ్య మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలను అనుసరిస్తూ పనిచేయాలని సూచించారు.



జనసేనలో చేరిన పెదవలస సర్పంచి, నాయకులు

మెనూ అమల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మెనూ అమలును పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

స్పందనకు వందనం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన భోజన మెనూ అమల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు హెచ్చరించారు. సొవ్వా గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో భోజన మెనూ అమలు చేయకపోవడంపై శుక్రవారం 'ఈనాడులో' 'గురువులకు గుడ్లు.. పిల్లలకు పాట్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఆ పాఠశాలను సందర్శించి మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్నే ఉపాధ్యాయులు తినాలని, ప్రత్యేకంగా వారికోసం వంట చేయడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు దాశరథి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ సదస్సులో 'ఏకలవ్య' బాలిక ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకున్న కారం మంగచైతన్య

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ సెమినార్‌లో మారేడుమిల్లి 'ఏకలవ్య' మోడల్ గురుకుల పాఠశాల గిరిజన విద్యార్థిని పాల్గొని సత్తా చాటింది. ఆమె ప్రదర్శించిన ప్రాజెక్టు అక్కడి ప్రతినిధులు, అధికారులను ఆకట్టుకుంది. ఆమెను ప్రశంసాపత్రంతో సత్కరించారు. దేశ రాజధానిలో ఈ నెల 22వ తేదీన నిర్వహించిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ సెమినార్‌లో మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కారం మంగ చైతన్య పాల్గొంది. కూనవరం మండలం కొండాయపాలెం గ్రామానికి చెందిన ఈమె కుటుంబ ఆర్థికస్థితి అంతంతమాత్రం. పాఠశాల యాజమాన్యం చొరవతో సెమినార్‌లో పాల్గొని, 'ఆరోగ్యం- నాణ్యత' అనే అంశంపై ఆంగ్ల భాషలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన నేషనల్ ఎడ్యుకేషన్ ఫర్ ట్రైబల్ స్టూడెంట్ (నెస్టు) అధికారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈమెను ఎంపిక చేశారు. దీనిలో భాగంగా దిల్లీలో జరిగిన సెమినార్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా అధికారులు, నెస్టు ప్రతినిధులను ఆకట్టుకుంది. ఆమెకు మెంటర్‌గా వ్యవహరించిన పాఠశాల అధ్యాపకుడు మణిభరత్‌లను పాఠశాల ప్రిన్సిపల్ శంకర్‌ప్రసాద్ అభినందించారు.

హక్కులపై అవగాహన అవసరం



కుమ్మరిపుట్టు ఏకలవ్య బాలికల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కుమ్మరిపుట్టు ఏకలవ్య బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు బాలల హక్కులు, విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని చెప్పారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులను హింసించడం, కొట్టడం నేరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని చెప్పారు. పాడేరు సీఐ దీనబంధు, ఎస్సై సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులు మెచ్చేలా... ఆదాయం వచ్చేలా!

ఈనాడు, విశాఖపట్నం

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విశాఖ కీర్తిని విశ్వవ్యాప్తంగా చేసేలా ఇక్కడి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పర్యాటకులను ఆకట్టుకుని, ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర పరిసరాల్లో ఆధ్యాత్మిక, తీర (బీచ్), క్రూయిజ్, పర్యావరణ, బౌద్ధ, చిత్ర, వైద్య పర్యాటకాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు శుక్రవారం నగరంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విశాఖ జోన్ సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.




హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు, మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

రూ.29 కోట్లతో బొర్రా గుహల అభివృద్ధి: బొర్రా గుహలు, లంబసింగి తదితర ప్రాంతాలను స్వదేశీ దర్శన్-2 కింద అభివృద్ధి చేయనున్నారు. రోడ్డు నుంచి గుహల ప్రవేశ ద్వారం వరకు షాపింగ్ స్ట్రీట్‌లా తీర్చిదిద్దడంతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బొర్రా గుహల అభివృద్ధికి రూ.29 కోట్లు మంజూరయ్యాయి. వాటితో దశల వారీగా అభివృద్ధి పనులు చేయనున్నారు. అరకు, అనంతగిరిలోని పర్యాటక అతిథి గృహాలను ప్రైవేటుకు దీటుగా ఆధునికీకరణ చేపట్టనున్నారు. నగరంలో యాత్రి నివాస్ సహా రాష్ట్రంలో 18 రిసార్ట్‌ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నారు. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలనుకుంటున్నారు.

పర్యాటకంపై శ్వేతపత్రం: రామకృష్ణ బీచ్ నుంచి భీమిలికి బస్సు సదుపాయం, శనివారం సాయంత్రాల్లో బీచ్‌లో డ్రోన్ షో ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని సీఐఐ విజ్ఞప్తి చేసింది. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా జేఎల్ఎల్ సంస్థ తయారుచేసిన విశాఖలో పర్యాటక రంగంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి

అనుమతులకు ఏకగవాక్ష విధానం: విశాఖలో సినిమా చిత్రీకరణలకు అనుమతులు ఇచ్చేందుకు ఏకగవాక్ష విధానం ఏర్పాటుచేయాలని సినీ పరిశ్రమ ప్రతినిధులు కోరుతున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం పర్యాటక పాలసీని తయారు చేయనుంది. తెన్నేటి పార్కుకు సమీపంలో ఉన్న 'ఎంవీ మా నౌక' తోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధికి అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అలాంటి ప్రాజెక్టుల వివరాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించనున్నారు.

క్రూయిజ్ హబ్‌గా: దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భాగంగా 'నీతిఆయోగ్ గ్రోత్‌హబ్' జాబితాలో దక్షిణ భారతదేశంలో విశాఖకు చోటుదక్కింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పర్యాటకపరంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోనున్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీలంక, చెన్నై, పుదుచ్చేరి ప్రాంతాలకు లగ్జరీ క్రూయిజ్‌లు ఏర్పాటుచేసి, క్రూయిజ్ టూరిజం అభివృద్ధి చేయనున్నారు.

సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి: నగరంలో వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపరుస్తాం. త్వరలో హాస్పిటాలిటీ శిక్షణ సంస్థలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటాం. హోటళ్లలో పని సమయానికి రాత్రి 12 గంటల పొడిగించడంతో పాటు నగరాన్ని పర్యాటకులకు అనుకూలంగా తీర్చిదిద్దడానికి వీధిదీపాలు, రవాణా సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాం' అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

పాపికొండలు విహారానికి వెళ్దామా..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ బోటింగ్ పాయింట్ నుంచి పాపికొండలు విహార యాత్ర ప్రారంభిస్తున్నామని ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వివిధ శాఖల అధికారులతో శుక్రవారం మూడు బోట్లలో వెళ్లి పరిశీలించామన్నారు. గండిపోశమ్మ పాయింట్ నుంచి 40 మంది పర్యాటకులు, నలుగురు సిబ్బంది ప్రయాణించేందుకు వీలైన సర్ ఆర్థర్ కాటన్ పర్యాటక శాఖ బోటు, 14 ప్రైవేటు బోట్లు పాపికొండల విహార యాత్రకు శనివారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు.

యాత్ర సాగేదిలా.. రాజమహేంద్రవరం ఏపీ పర్యాటక శాఖ కార్యాలయం నుంచి ఉదయం 7.30 గంటలకు వాహనంలో బయలుదేరి గండిపోశమ్మ బోటింగ్ పాయింట్‌కు సందర్శకులు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి 9.30 గంటలకు విహార యాత్ర మొదలై సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ గండిపోశమ్మ బోటింగ్ పాయింట్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి వాహనంలో బయలుదేరి సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకోవడంతో యాత్ర ముగుస్తుందన్నారు.

టికెట్ రుసుము ఇలా.. (రూ.లలో)
రాజమహేంద్రవరం నుంచి..
పెద్దలకు: 1,250
పిల్లలకు(పదేళ్లలోపు): 1000
గండిపోశమ్మ బోటింగ్ నుంచి..
పెద్దలకు:1000 పిల్లలకు(పదేళ్లలోపు):750
సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
98486 29341

పర్యాటకుల భద్రతే ముఖ్యం



ట్రయల్ రన్‌కు వెళ్తున్న సబ్‌కలెక్టర్ తదితరులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటకుల భద్రతే ముఖ్యమని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో జులై 13 నుంచి నిలిపివేసిన ఈ విహారయాత్రలను ఎట్టకేలకు వంద రోజుల తర్వాత ఆమె అనుమతిచ్చారు. దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం వద్ద బోటు పాయింట్ నుంచి దేవీపట్నం పోలీసు స్టేషన్ వరకు మూడు బోట్లపై శుక్రవారం ట్రయల్ రన్, మాక్ డ్రిల్ నిర్వహించారు. పోశమ్మగండి, పూడిపల్లి, దేవీపట్నం వద్ద గోదావరి నదిలో వరద పరిస్థితిని జలవనరుల శాఖ అధికారులు ఆమెకు వివరించారు. దేవీపట్నం పోలీసు స్టేషన్ వద్ద, గోదావరి నది మధ్యలో ప్రమాదవశాత్తు బోటు ప్రమాదానికి గురైతే పర్యాటకులను ఏ విధంగా కాపాడాలనే వాటిపై ఎస్డీఆర్ఎఫ్ సుమారు రెండు గంటలపాటు అవగాహన కల్పించారు. పర్యాటకులను ప్రమాదం నుంచి కాపాడిన అనంతరం వారికి ఏవిధమైన వైద్యసేవలు అందించాలి తదితర వాటిపై వివరించారు. బోటు నిర్వాహకులకు భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.



ప్రమాద సమయంలో పర్యాటకులను రక్షించడంపై అవగాహన కల్పిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

తనిఖీల అనంతరం అనుమతులు

గతంలో గోదావరిలో వరదలు తగ్గిన అనంతరం ట్రయల్ రన్ నిర్వహించి పాపికొండల విహారయాత్రకు అధికారులు అనుమతులు ఇచ్చేవారు. ఇటీవల మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం వద్ద కొండవాగులో వైద్య విద్యార్థుల ప్రమాద ఘటనతో అంతా అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్లను రెండుసార్లు తనిఖీల అనంతరం సబ్‌కలెక్టర్ విహారయాత్రకు పచ్చ జెండా ఊపారు. ప్రస్తుతం గండిపోశమ్మ ఆలయం వద్ద 14 బోట్లకు అనుమతులు సిద్ధంగా ఉన్నాయని జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు వెలమ కుల వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి వెలమ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం పెందుర్తి వెలమతోట (అనకాపల్లి రోడ్డు)లోని శ్రీవెలమ రైతు సేవా సంఘం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు **(శనివారం, అక్టోబరు 26న)**, రేపు **(ఆదివారం, అక్టోబరు 27న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా, యాప్ ద్వారానూ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు.
– న్యూస్‌టుడే, విశాఖపట్నం

తొమ్మిది కేజీల గంజాయి పట్టివేత

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మీదుగా రవాణా చేస్తున్న గంజాయిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. తొమ్మిది కేజీల గంజాయితో.. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం మేరకు మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై రాముడు నాయుడు మద్దులూరు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు తప్పించుకుని వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. మచిలీపట్నానికి చెందిన జల్లి నిఖిత్‌కుమార్, భూక్య శివాజీ, పుట్టి సాయిధీరజ్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి తొమ్మిది కిలోల గంజాయితో పాటు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మచిలీపట్నానికి చెందిన షేక్‌బాబావలీ ధారకొండ నుంచి గంజాయిని తీసుకొచ్చి, అప్పగిస్తే తమకు నగదుతో పాటు, కొంత గంజాయి ఇస్తానని చెప్పినట్లు నిందితులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.45 వేలు ఉంటుందని అంచనా.


నక్కపల్లిలో నంజుకుంటున్నారు...!

తీరంలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

ఈనాడు, అనకాపల్లి – న్యూస్‌టుడే, నక్కపల్లి

ఇసుక బంగారంలా మారింది. అక్రమార్కులకు కాసులు కురిపిస్తుండగా, ప్రభుత్వాదాయానికి, పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ముఖ్యంగా నక్కపల్లి మండలంలోని తీర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించుకుపోతుండగా, అధికార యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది.

నక్కపల్లి మండలంలో నదులు, కాలువలు లేకపోయినా.. సముద్రతీర ప్రాంతం దోపిడీదారులకు ఆదాయ వనరుగా మారిపోయింది. ప్రధానంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించి అధికారికంగా నక్కపల్లి డిపో ఒక్కటి మాత్రమే ఉంది. దీన్లో నిల్వలు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి తరలించడం ఆలస్యం అవుతుండటంతో కొందరు తీరప్రాంతంపై కన్నేశారు. వీరి అడ్డగోలు తవ్వకాలకు కొందరు నాయకులు సహకరిస్తున్నారు. వారికి లంచాలకు మరిగిన ఉద్యోగులు సైతం వంత పాడుతున్నారు. ముఖ్యంగా అమలాపురం, డీఎల్‌పురం ప్రాంతాల్లో ఇసుకపైనే అందరి కళ్లు పడ్డాయి. ఇక్కడ ఉప్పుటేరు కలిసిన ప్రాంతంలో సాధారణ ఇసుక మాదిరిగా ఉండటం వీరి పంట పండినట్లైంది. సముద్ర తీరాన్ని ఆనుకుని తోట భూముల్లో ఇలాంటి ఇసుక భారీగా ఉంది. ఈ భూములను ఏపీఐఐసీ పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం సేకరించింది. దీంతో అక్రమార్కులంతా కలిసి వీటిని కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడినుంచి పెద్దఎత్తున ఇసుక లారీలు, ట్రాక్టర్లలో తరలిపోతోంది. అడ్డుచెప్పిన వారిని లోబర్చుకుంటున్న అక్రమార్కులు కాసులతో వారి నోళ్లను కట్టేస్తున్నారు.



అమలాపురం తీర ప్రాంతంలో తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

ఉచిత విధానం అమలవుతున్నా..

ప్రభుత్వం ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలవుతోంది. జిల్లాలో నదులున్నా.. వాటిల్లో నిండుగా నీరుంది. దీంతో తవ్వకాలకు వీలు కావడం లేదు. మరోవైపు నర్సీపట్నం వద్ద గబ్బాడ యార్డులో వివాదం నెలకొని అమ్మకాలకు ఆటంకం కలిగింది. ఎట్టకేలకు ఇటీవలే విక్రయాలు మొదలయ్యాయి. ఇది గత ప్రభుత్వ హయాంలో గోదావరి ప్రాంతం నుంచి తెచ్చి నిల్వ చేయడంతో రవాణా ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. దీంతో 4 టన్నుల ఇసుక కొనుగోలుకు దాదాపు రూ. 4.5 వేలు అవుతుంది. ట్రాక్టరు/లారీ ద్వారా సరకు రప్పించుకోవడానికి అదనపు ఛార్జీలు చెల్లించాలి. దీంతో ఖర్చు అధికమవుతోంది. దీనికంటే తక్కువ ధరకు లభిస్తున్న అమలాపురం, డీఎల్‌పురం ప్రాంతాల్లోని ఇసుకను తరలించుకుపోతున్నారు. ఇలా రోజూ రూ.లక్షల రూపాయల విలువైన దందా జరుగుతోంది. ఎక్కువగా పరవాడ, అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్. ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇక తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో పది నుంచి ఇరవై అడుగుల లోతున మేర గుంతలు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే వాహన రాకపోకలకు వీలుగా మార్గాలు పెట్టారు. తవ్వకాలు రాత్రిళ్లు చేపట్టి, నిల్వ చేసిన సరకును దర్జాగా పగటి వేళల్లో తరలించుకుపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారులు సైతం దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా తీరప్రాంతానికి రక్షణగా నిలిచే తోటలు అడ్డగోలు తవ్వకాలతో దెబ్బతింటున్నాయి.



పట్టుకున్న ఇసుకకు ఇటీవల వేలం నిర్వహించిన అధికారులు

"గడిచిన రెండు నెలల కాలంలో పోలీసులు పలుమార్లు దాడులు చేసి పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు తప్పితే.. మిగిలిన మైనింగ్, ఏపీఐఐసీ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు ఎవ్వరూ కనీసం పట్టించుకోలేదు."

"ఈ నెల ఒకటో తేదీన అమలాపురం ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వను గుర్తించిన అధికారులు వేలంవేసి రూ.1.03 లక్షలకు విక్రయించారు. ఇలాంటి గుట్టలెన్నో ఉన్నాయి."

కఠిన చర్యలు తీసుకోవాలి




మా ప్రాంతంలోని సముద్రతీరం నుంచి రోజూ భారీఎత్తున సముద్రపు ఇసుక తరలిపోతోంది. పోలీసులు తప్పితే మిగిలిన అధికారులు దీన్ని అడ్డుకోవడంలేదు. ఇప్పటికే దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేశాను, అయినా అధికారులు పట్టించుకోలేదు. ప్రధానంగా తీరం దెబ్బతినడంతో పాటు, రహదారులు పాడవుతున్నాయి. ఇటీవల మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లాను. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని తీరాన్ని రక్షించాలి.
– ఎరిపల్లి సత్తిబాబు, అమలాపురం

నిరంతర నిఘా



తీర ప్రాంతాల్లో ఇష్టానుసారం ఇసుకను తవ్వడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వాటిలో తవ్వకాలు చేస్తే ఉపేక్షించం. ఇప్పటికే దాడులు చేసి పదుల సంఖ్యలో కేసులు పెట్టి, జరిమానా విధించాం. స్వాధీనం చేసుకున్న నిల్వలను రెవెన్యూ అధికారుల సమక్షంలో వేలం వేయించాం. తీరప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు. దీన్ని అరికట్టడానికి నిరంతర నిఘా పెట్టాం. స్థానికులు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటాం.
– కె.కుమారస్వామి, సీఐ, నక్కపల్లి

అడ్డుకట్ట వేస్తాం



తీరప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించి చర్యలు చేపట్టడానికి కార్యాచరణతో సిద్ధమవుతున్నాం. ఆ మేరకు మైనింగ్, పోలీసు అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతాం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.
– ఆర్.నరసింహమూర్తి, తహసీల్దారు, నక్కపల్లి

కలప స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న తంగేడు దుంగలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రివాడ పంచాయతీ దొడ్డవరం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 74 తంగేడు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పెదవలస అటవీ రేంజ్ అధికారి శివరంజని శుక్రవారం తెలిపారు. సిబ్బందితో కలిసి సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ దుంగలు పట్టుబడినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.17 వేలు ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న కలపను కాకరపాడు కలప డిపోకు తరలించామని పేర్కొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గరికిబంద సమీపంలో అక్రమంగా ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నామని అటవీశాఖ పెదవలస రేంజ్ అధికారిణి శివరంజని శుక్రవారం తెలిపారు. తమ సిబ్బందితో గురువారం రాత్రి తనిఖీ చేయగా.. రూ. 12 వేలు విలువ చేసే 14 బూసి దుంగలు పట్టుబడ్డాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కాకరపాడు డిపోకు తరలించామని తెలిపారు.

పాఠశాలల్లో తనిఖీలు



మర్రిపాలెం పాఠశాలలో అపార్ ఐడీ నమోదు వివరాలను పరిశీలిస్తున్న ఎంఈవో

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మండలంలో పలు పాఠశాలలను ఎంఈవో-2 సూరయ్యరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. శరభవరం, మర్రిపాలెంలోని ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. బేస్‌లైన్ పరీక్ష ఫలితాలు, ఇతర దస్త్రాలను పరిశీలించారు. మర్రిపాలెం పాఠశాలలో అపార్ ఐడీ నమోదు వివరాలు పరిశీలించారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరులో బీఎస్ఎన్ఎల్ సెల్ సంకేతాలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. అంతర్జాల సేవలూ నిలిచిపోతుండటంతో బ్యాంకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఇబ్బంది కలుగుతోంది. మంప, శరభన్నపాలెంలోని సెల్ టవర్ల నుంచి సంకేతాలు సక్రమంగా అందడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు తెలుపుతున్నా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెల్, అంతర్జాల సంకేతాలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. గన్నవరంలో శుక్రవారం సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ విలీన మండలాల్లో ఉపాధి హామీ పని దినాలు 150 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. కాంటూరుతో సంబంధం లేకుండా పోలవరం ముంపు పరిహారం చెల్లించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ పనుల అనుమతుల్లో జాప్యం చేస్తే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. గన్నవరం సర్పంచి గడ్డం భద్రమ్మ, సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, వల్లభనేని సత్యనారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో గెలుపొందారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన ఎంపిక పోటీల్లో ముగ్గురు కేజీబీవీ విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. అండర్-14 అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్‌త్రోలో ఎనిమిదో తరగతి విద్యార్థిని బచ్చెల లలిత, 100 మీటర్ల పరుగు పందెంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని నైని కుమారి మూడో స్థానం కైవసం చేసుకోగా, అండర్-17 అథ్లెటిక్స్ విభాగంలో జావెలిన్‌త్రోలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని రేవుల గౌరమ్మ ద్వితీయస్థానం సాధించింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచి, విజేతలుగా నిలిచిన విద్యార్థినులు, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల ప్రత్యేకాధికారిణి మయూరి లక్ష్మి అభినందించారు.

అభివృద్ధి పనులపై దృష్టి: పీవో



అధికారులతో సమీక్షిస్తున్న పీవో సింహాచలం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో పీవో సింహాచలం శుక్రవారం వేర్వేరుగా సమీక్షించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించి పలు అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టడంతోపాటు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం, నాబార్డు ద్వారా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరయ్యాయి.. ఎన్ని ప్రారంభించారు.. ఎన్ని రోడ్డు పనులు చేపట్టారు.. తదితర వివరాలను పీవో అడిగి తెలుసుకున్నారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు ఇప్పటివరకు ఏయే రకాల మొక్కలు పంపిణీ చేశారని..ఎన్ని ఎకరాల్లో రబ్బరు ప్లాంటేషన్ వేశారు అని ఉద్యాన శాఖ అధికారులను ఆరాతీశారు. వైద్యారోగ్యశాఖ ద్వారా ఏజెన్సీలో సికెల్‌సెల్ వ్యాధిగ్రస్థులు ఎంతమంది ఉన్నారు.. ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.. ఎంతమందికి హెల్త్‌కార్డులు జారీ చేశారని వైద్యారోగ్యశాఖ అధికారులను ప్రశ్నించారు. మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వెలుగు అధికారులతో సమీక్షించారు. ఏజెన్సీలో ఎంతమంది ఉపాధ్యాయులకు బేస్‌లైన్ శిక్షణ ఇచ్చారని, పదో తరగతి ఉత్తీర్ణతకు తీసుకొంటున్న చర్యలపై విద్యాశాఖ అధికారులను అడిగారు. ఐటీడీఏ ఏపీవో డీఎన్వీ రమణ, గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి, ఈఈ శ్రీనివాసరావు, డీఈ చైతన్య, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏడీఎంహెచ్‌వో డాక్టరు శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి, వ్యవసాయశాఖ ఏడీ చౌదరి, పీఆర్ ఈఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలుపై ఆరా

పాడేరు, హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట మండలం పెదగరువు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి జి.స్వర్ణ శుక్రవారం రాత్రి సందర్శించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వంట గదిని తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తి

నదిలో గిరిజనుడి గల్లంతు

ముంచంగిపుట్టు గ్రామీణం: చేపలు పట్టడానికి వెళ్లి గిరిజనుడు గల్లంతైన ఘటన ఏవోబీలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఒనకఢిల్లీ పంచాయతీ కుదంగుడలో నివసిస్తున్న శుక్రగోల్లోరి (53) గురువారం సాయంత్రం మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రం దిగువన నదిలో చేపలు పట్టడానికి వెళ్లారు. వలకు భారీ చేప పడి లాగేయడంతో నదిలో పడి గల్లంతయ్యారు. ఆయనతోపాటు వెళ్లిన బంధువు కుటుంబసభ్యులు సమాచారం ఇచ్చాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నా చీకటి కావడంతో గాలింపు చేపట్టలేదు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. రెండేళ్ల క్రితం శుక్రగోల్లోరి సోదరుడు గోల్లోరి కూడా ఇదే ప్రదేశంలో చేపలు పడుతూ మృతి చెందాడు.



గల్లంతైన ప్రదేశంలో స్థానికులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	105	100
లైవ్	127	120
డ్రెస్డ్	184	210
స్కిన్‌లెస్	210	220

పశుగణన పక్కాగా చేయండి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో పశుగణన పక్కాగా చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అఖిల భారత పశుగణన గోడప్రతులను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 2025 ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సిబ్బందికి పశువుల సమగ్ర సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

★ స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో 39 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల స్త్రీనిధి రుణాల చెక్కును కలెక్టర్, జేసీ, పీఓ, సబ్ కలెక్టర్ పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ మురళి పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో పశు గణన ప్రారంభమైందని రేఖపల్లి పశువైద్యశాల వైద్యులు రాజేశ్వరి తెలిపారు. పెద్దమట్టపల్లి గ్రామస్థులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచి వెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: బొడ్డగండి పంచాయతీ గంగవాడలో పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. పశు వైద్యాధికారి వీరేంద్ర సూచనల మేరకు సచివాలయ పశు సహాయకులు భద్రం ఆధ్వర్యాన గ్రామంలో పశుగణన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ హాజరయ్యారు.



పెద్దమట్టపల్లిలో కరపత్రాలతో వైద్యురాలు, సిబ్బంది



ఊట వద్ద దుస్తులు ఉతుకుతున్న గిరిజనులు

అన్నింటికీ ఊట నీరు.. ఎన్నాళ్లీ తీరు?

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా గిరిజన గ్రామాల్లో తాగునీటికి ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలోని రొంపుల శివారు వీధిలో నివసిస్తున్న గిరిజనులకు ఊట నీరే ఆధారంగా మారింది. స్థానికంగా బోరున్నా పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు. గ్రామానికి సమీపంలో ఊట నీరే తాగేందుకు, గిన్నెలు కడిగేందుకు, దుస్తులు ఉతికేందుకు ఆధారమవుతోంది. ఎన్నాళ్లు ఇలా ఇబ్బందులు ఎదుర్కోవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీరు అందించాలని కోరుతున్నారు.



తాగేందుకు ఊటనీటిని సేకరిస్తున్న మహిళలు

కొత్తూరులో కటకట



కొత్తూరులో నిరుపయోగంగా బావి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

వనబసింగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన సౌరవిద్యుత్తు నీటి పథకం మూలకు చేరింది. గ్రామం మధ్యలో ఉన్న బావిలో ఒరలు కుంగిపోయాయి. కుంగిన బావికి ఒరలు అమర్చిన అధికారులు, చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మాణం మరిచారు. సౌర విద్యుత్తు నీటి పథకం ట్యాంకుకు నీరందించే పైపులు ఛిద్రమయ్యాయి. మోటారు మరమ్మతులకు గురైంది. బోరు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. నీటి వసతులు మూలకు చేరటంతో ప్రజలు కి.మీ. దూరంలో ఉన్న ఊటనీరు తెచ్చుకుని వినియోగిస్తున్నారు. రోడ్డు దాటుకుని వెళ్లి నీరు తెచ్చుకునేందుకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పనిచేయని సౌరవిద్యుత్తు పథకం

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ నాయకులు అవగాహన కల్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, మోదాపుట్టు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిశారు. ఓటరు నమోదు ప్రతిని ఉపాధ్యాయులకు అందించారు. ఏపీటీఎఫ్ నాయకులు పోతురాజు, శాంతకుమారి, బైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 4జీ సేవలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో ఎట్టకేలకు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను శుక్రవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు బీఎస్ఎన్ఎల్ ఏఈ మిథున్ సిబ్బందితో కలిసి శుక్రవారం సీలేరు వచ్చి 4జీ సేవలు ప్రారంభించారు.

తుపానుపై అప్రమత్తం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుతం నెలకొన్న 'దానా' తుపాను నేపథ్యంలో మండలవాసులంతా అప్రమత్తంగా ఉండాలని, కొండవాగుల వద్ద అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నామని మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఎవరూ వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. పర్యటకులు ఎవరూ జలపాతాల వద్దకు వెళ్లవద్దని కోరారు.

అవీ ఇవీ

పెయింటర్ కుటుంబానికి సాయం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ సీకాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన పెయింటర్ కొర్ర శ్రీను కుటుంబానికి తేజావలి పెయింటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.10 వేల సాయం అందించారు. కొండలరావు, దాసు, గోపి, రాజేంద్ర, సుందరమ్మ సర్పంచి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా శ్రీనివాసరావు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి వెలుగు ఏపీఎంగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన పోలవరం వెలుగు కార్యాలయంలో పనిచేశారు. ఇంతవరకు చింతపల్లిలో ఏపీఎంగా పనిచేసిన నాయుడు పాయకరావుపేటకు బదిలీపై వెళ్లారు. నూతన ఏపీఎంకు మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సన్యాసమ్మ, లక్ష్మి, అకౌంటెంట్ నీలావతి స్వాగతం పలికారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా వసుధ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ కె. వసుధ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈమె కృష్ణా జిల్లా మొవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ ప్రిన్సిపల్‌గా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా డాక్టరు చిట్టిబాబు పనిచేశారు. వైస్ ప్రిన్సిపల్ డి. రవికుమార్, అధ్యాపకులు చక్రవర్తి, శివకుమారి, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ భరత్ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ వసుధను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం డౌనూరులోని చిరువ్యాపారులకు మాజీ ఎంపీ మాధవి గొడుగులు పంపిణీ చేశారు. ముందుగా దేముడు చిత్రపటానికి మాధవి, జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు తదితరులు నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నేనుసైతం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ శివప్రసాద్, సర్పంచులు భవానీ, వెంకటలక్ష్మి, సంస్థ డైరెక్టర్ సురేష్‌పట్నాయక్, గ్రామపెద్దలు పోతురాజు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలగుడలో గ్రామసభ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోతంగి పంచాయతీ ఉయ్యాలగుడలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది గ్రామసభ నిర్వహించారు. సిబ్బంది రమేష్, బాలయ్య, బీమన్న పాల్గొని గిరిజనులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని సర్పంచి కొండా జాకబ్, ఉపసర్పంచి బొడ్డేటి వీరబాబు వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీ నిధులతో బోరు వేసి, దానికి మోటారును అమర్చారు. శుక్రవారం ఈ బోరును వారు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు తాగునీటితోపాటు, వాడుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు.

రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా రెండు వేల టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించామని పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ తెలిపారు. శుక్రవారం కాఫీ విభాగం, జీసీసీ అధికారులు, కాఫీ లైజన్ వర్కర్లతో పంట సేకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో కాఫీ సాగును మరింత అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. ఐటీడీఏ ద్వారా అరబికా పార్చ్‌మెంట్ కాఫీని కిలో రూ.285లకు, అరబికా చెర్రీ రూ.150లు, రొబస్టా రూ.80లకు కొనుగోలు చేస్తారని చెప్పారు. ఐటీడీఏ నుంచి కాఫీ పండ్లు రూ.44లకు కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం జి.మాడుగుల, జి.కె.వీధి మండలాల్లో పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరుకు అంగీకరించిందని తెలిపారు. పండ్ల సేకరణలో సమస్యలుంటే ఐటీడీఏ కాల్ సెంటర్ 08935 250833, జీసీసీ కాల్ సెంటర్ 70130 70990 నంబర్లకు ఫోన్‌చేయాలని సూచించారు. కాఫీ బోర్డు డీడీ రమేష్, పీహెచ్ఓ అశోక్, ఏపీఓ వెంకటేశ్వరరావు, జీసీసీ డీఎం సింహాచలం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ, చిత్రంలో డీడీ తదితరులు

రెన్యువల్ చేయాలని వినతి

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ పరిధిలోని మహిళా గురుకుల, ఏకలవ్య పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న తమను 2025 జనవరి నుంచి రెన్యువల్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ మహిళా సెక్యూరిటీగార్డులు కోరారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్‌ను గిరిజన సంఘం నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ.. సెక్యూరిటీగార్డుల మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ఎం.ప్రశాంతి, నాగమణి, మమత, సింహాచలం, రాజేశ్వరి పాల్గొన్నారు.

ముళ్లపొదలతో ముప్పు

ఎటపాక, న్యూస్‌టుడే

★ ఎటపాక మండలం గన్నవరం-తోటపల్లి మధ్యలో ప్రధాన రహదారి మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

★ కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో తెలంగాణ రాష్ట్రం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

విలీన మండలాల్లో రహదారుల దుస్థితి



గౌరిదేవిపేట ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు

ఎటపాక, కూనవరం, వరరామచంద్రపురం, చింతూరు మండలాల పరిధిలోని రహదారులను కనిపించకుండా ముళ్లపొదలు ఆక్రమించాయి. దీంతో మలుపుల్లో ఎదురెదురు వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఎటపాక మండలం నెల్లిపాక, బుట్టాయిగూడెం, సీతాపురం, తోటపల్లి, గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు, కూనవరం మండలం పోలిపాక, కాచవరం, నర్సింగపేట, భీమవరం, ఆర్కూరు, భగవాన్‌పురం రహదారుల్లో ముళ్లపొదలు ప్రమాదకరంగా మారాయి. వరరామచంద్రపురం, చింతూరు మండలాల పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విలీన మండలాల మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు నిత్యం వాహన రాకపోకలు జరుగుతుంటాయి. మారేడుమిల్లి, రంపచోడవరం, భద్రాచలం, పాపికొండలకు వెళ్లే పర్యాటక వాహనాలు ఈ మార్గంలోనే తిరుగుతాయి. రహదారులపై ముళ్లపొదలతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని ముళ్లపొదలు తొలగించాలని కోరుతున్నారు. చింతూరు పీవో అపూర్వ భరత్ వద్ద రహదారుల పరిస్థితిని ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి ముళ్ల పొదల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.



గన్నవరం సమీపంలో ..

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అరుకులో మురుగు కాలువ శుభ్రం చేస్తున్న సర్పంచి శారద, సిబ్బంది

పాడేరు, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని ఎంపీడీఓ డేవిడ్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం పాడేరులో శ్రమదానం చేపట్టి చెత్త తొలగించారు. ఎంపీడీఓ డేవిడ్‌రాజు, ఈవోఆర్డీ రమేష్ ఈ పనులు పర్యవేక్షించారు. వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. మినుములూరు పీహెచ్‌సీ పరిసరాల్లో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఫ్రైడే- డ్రైడేపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యుడు గోపాలకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, పర్యవేక్షకులు వరలక్ష్మి, సరోజిని, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

కొయ్యూరు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: రావణాపల్లిలో ఎంపీడీవో ఎస్.కె.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. అరుకులో సర్పంచి శారద ఆధ్వర్యంలో, డుంబ్రిగుడ పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బంది, సొవ్వాలో సిబ్బంది శ్రమదానం చేశారు.

చింతపల్లి గ్రామీణం, జి.మాడుగుల, న్యూస్‌టుడే: పర్యాటక ప్రదేశం లంబసింగిని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి లంబసింగిలో పరిసరాలు శుభ్రం చేశారు. సీడీపీవో రమణి, రామలక్ష్మి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు లక్ష్మయ్య, మహేంద్ర, లోవరాజు, జగన్నాథపడాల్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగుల రెవెన్యూ కాలనీ, తీగలమెట్టలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చెత్తబుట్టలను అందజేశారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కె.కళ్యాణం, పంచాయతీ కార్యదర్శి రమాశంకర్, తెదేపా నాయకులు మత్స్యరాజు, కొండబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టు గ్రామీణం, పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: జోలాపుట్టు పంచాయతీ బోంద్రుగుడలో సర్పంచి నీలకంఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెదబయలు జిల్లా పరిషత్తు అతిథి గృహ సమీపంలో సర్పంచి పలాసీ మాధవరావు ఆధ్వర్యంలో శ్రమదానం చేసి చెత్త తొలగించారు. ఎంపీడీవో పూర్ణయ్య పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ఆసుపత్రి పరిసరాల్లో డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ సభ్యులు బొంజుబాబు వార్డు సభ్యుడు జీవన్ తదితరులు పాల్గొన్నారు.



లంబసింగిలో..

రంపచోడవరం, మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని వెలుగు ఏపీఎం జీఆర్‌కే స్వామి సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.గంగాభవాని, కార్యదర్శి కుంజం బాపనమ్మ పాల్గొన్నారు. మారేడుమిల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ప్రధాన రహదారులతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు శుభ్రం చేశారు. ఎంపీడీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం, ఎటపాక, న్యూస్‌టుడే: కూనవరం పంచాయతీ కార్యాలయ సమీపాన పెరిగిన ముళ్ల పొదలు, చెత్తను సర్పంచి హేమంత్, ఈవోఆర్డీ రాంప్రసాదు, కార్యదర్శి సురేశ్, సచివాలయ సిబ్బంది కలసి తొలగించారు. క్రిష్టవరం, గన్నవరం సచివాలయాల పరిధిలోని పలు ప్రదేశాలను సచివాలయ, వైద్యారోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు శుభ్రం చేశారు. ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.



కాపుగొంపల్లిలో ద్రావణం పిచికారీ

పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో మూడు రోజులుగా నీటి మట్టం క్రమంగా పెరుగుతూనే ఉంది. గండిపోశమ్మ ఆలయం వరకు శుక్రవారం నాటికి వరద నీరు చేరింది. డి.రావిలంక- దండంగి గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రహదారిపై వరద నీరు పెరగడంతో రాకపోకలు నిలిచాయి. భక్తులు గంగంపాలెం నుంచి కొండమార్గాన పోశమ్మగండి చేరుకుంటున్నారు. సీతపల్లి వాగుకు గోదావరి పోటెత్తింది. ఇప్పటికే గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. త్వరలోనే అమ్మవారి దర్శనాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో మళ్లీ గోదావరిలో నీటి మట్టం పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 27 మీటర్లకు పైగా నీటి మట్టం కొనసాగుతోందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు.



గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరిన నీరు

ఆదివాసీ జేఏసీ నూతన కమిటీల ఏర్పాటుకు చర్యలు



రింతాడలో సమావేశమై సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఆదివాసీ జేఏసీ నూతన కమిటీల ఏర్పాటు చేస్తామని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.మోహన్‌రావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఉగ్రంగి వెంకటగిరి తెలిపారు. రింతాడలో శుక్రవారం ఆదివాసీ జేఏసీ చింతపల్లి డివిజన్ ఇంటలెక్చువల్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల జేఏసీలు ఏర్పాటు చేసి సుమారు ఎనిమిదేళ్లవుతోందన్నారు. కొత్త కమిటీలు ఏర్పాటు చేసేందుకు పాతవి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బౌడు గంగరాజు, పాతుని రామరాజు, ఎంవీ రమణ, ముక్కలి కామేశ్వరరావు, కిట్లంగి పెద్దబ్బాయి, రెడ్డి వెంకటేశ్వర్లు, సాసం వినోద్‌కుమార్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశమైన తెదేపా నాయకులు, కార్యకర్తలు

సభ్యత్వ నమోదులో ముందుందాం

కూనవరం, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదులో మండలాన్ని మొదటిస్థానంలో నిలపాలని తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కర్‌రావు ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని, కొత్త వారిని సభ్యులుగా చేర్చాలన్నారు. సభ్యత్వం ఉన్న వారికి వచ్చే ఉపయోగాలను వివరించారు. మండల కార్యదర్శి పొడియం అప్పారావు, శివయ్య, ఉమామహేశ్వరరావు, రత్తయ్య, బుచ్చిరాజు, రాజారావు, రామకృష్ణ, వీరభద్రం, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా పథకాల అమలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడం ద్వారా మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకరించాలని ఎంపీడీవో తూటిక శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయాలు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు. సచివాలయ సంక్షేమాధికారులు విధిగా ప్రతి సోమ, గురువారాల్లో పాఠశాలలను సందర్శించి మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. పరిపాలనాధికారిణి రత్నకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణరావు, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసవిశ్వనాథ్

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: సాయిబాబా ఆలయ వీధిలో రహదారికి మధ్యలో వర్షపునీరు నిలిచిపోతుంది. స్థానికులతోపాటు జీవీకే పాఠశాలకు వెళ్లే పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– స్థానికులు, సాయిబాబా ఆలయవీధి, రంపచోడవరం



✓: సాయిబాబా ఆలయ వీధిలో రహదారిలో వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు చేపడతాం.

– సుండం శ్రీనివాసుదొర, ఎంపీడీవో, రంపచోడవరం.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లిలో సీఎస్ఐ చర్చి ఎదురుగా పశువుల ఆసుపత్రికి వెళ్లే దారి మినీ ట్యాంకు నుంచి వస్తున్న వ్యర్థ జలాలతో బురద గుంటగా మారింది. మురుగు ప్రధాన రహదారిపైనే పారుతూ అస్తవ్యస్తంగా మారింది.

– సాయి, మారేడుమిల్లి

✓: ఈ రహదారిపై మురుగు నిల్వ ఉంకుండా చర్యలు చేపడతాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ, మారేడుమిల్లి

ఆశ్రమ విద్యార్థినులకు కంటి పరీక్షలు



గాంధీనగర్ పాఠశాలలో విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగులలోని గాంధీనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం కంటి పరీక్షలు చేశారు. జిల్లా నేత్ర వైద్యాధికారి డి.వెంకటరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విశ్వేశ్వరనాయుడు ఆధ్వర్యంలో 482 మందికి పరీక్షలు చేయగా.. 10 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. జి.మాడుగుల వైద్యాధికారి శశికాంత్, ఆరోగ్య విస్తరణాధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డీకే హిమబిందు అన్నారు. ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు.



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి హిమబిందు

క్రమశిక్షణతో మెలగాలి

గంగవరం, న్యూస్‌టుడే: బాలికలు క్రమశిక్షణతో మెలుగుతూ చదవాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో టి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రాధాన్యాన్ని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, నీతి ఆయోగ్ ప్రతినిధి హేమమాధురి, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు తొలగించాలని ఆందోళన

చింతూరు, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిపై ఉన్న మద్యం దుకాణాలు తొలగించాలని డిమాండ్ చేస్తూ చింతూరులోని వినాయక దేవాలయం భక్తులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై దుకాణం నిర్వహిస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై షణ్ముఖరావు అన్నారు. జి.మాడుగులలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బందవీధి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జి.మాడుగుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు